హైస్కూల్ ప్లస్‌పై ప్రత్యేక దృష్టి

- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య
- హైస్కూల్ ప్లస్‌కు ఉపాధ్యాయుల నియామకం
- విద్యార్థుల ఉజ్వత భవితకు ప్రాధాన్యం
- పునాదిపాడులో కొనసాగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ


హైస్కూల్ ప్లస్ నిర్వహిస్తున్న పునాదిపాడు జెడ్పీ పాఠశాల

కంకిపాడు: హైస్కూల్ ప్లస్ విద్యపై ప్రభుత్వం మరింత దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఇంటర్ విద్యను అందించి వారి ఉజ్వల భవితకు బాటలు వేసేందుకు వైఎస్సార్ సీపీ సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఉత్తమ బోధన అందించేందుకు అవసరమైన ఉపాధ్యాయ సిబ్బందిని నియమించింది. మెరుగైన ఫలితాల సాధనకు నూతన విద్యా విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తోంది.

పునాదిపాడులో హైస్కూల్ ప్లస్.....

మండల స్థాయిలో ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం గత విద్యాసంవత్సరం నుంచి నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో హైస్కూల్ ప్లస్ కేంద్రం ఏర్పాటుచేసింది. ఈ సెంటరులో ఇంటర్మీడియట్ బైపీసీ విద్యను బాలికలకు ప్రత్యేకంగా అందిస్తుంది. ఆ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులే తొలి ఏడాది విద్యార్థులకు బోధన సాగించారు.

పటిష్టంగా హైస్కూల్ ప్లస్....

హైస్కూల్ ప్లస్ విద్యను మరింత పటిష్టంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే ఈ విద్యాసంవత్సరం హైస్కూల్ ప్లస్ కేంద్రాలకు ప్రత్యేకంగా బోధనా సిబ్బందిని నియమించారు. విద్యాశాఖ పర్యవేక్షణలో ఇటీవల నిర్వహించిన బదిలీల ప్రక్రియలో పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్లను హైస్కూల్ ప్లస్‌కు నియమించారు. ఈ చర్యల్లో భాగంగా పునాదిపాడు పాఠశాలకు ప్లస్ 2 బోధనకు ఆరుగురు పీజీటీ పోస్టులను కేటాయించారు. తెలుగు, ఇంగ్లీషు, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి ప్రత్యేక నిపుణులైన బోధకులు బదిలీపై వచ్చారు. ఈ విద్యాసంవత్సరం జూన్ 1 నుంచి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. జూనియర్ ఇంటర్ 10 మంది, సీనియర్ ఇంటర్ 10 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అడ్మిషన్ల సంఖ్యను పెంపొందించేందుకు అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చైతన్య పరుస్తున్నారు. తొమ్మిదో తరగతి నుంచి ప్లస్ 2 వరకూ పీజీటీలు విద్యాబోధన సాగించాల్సి ఉంది. దీని వల్ల ఉపాధ్యాయుల సంఖ్య పెంపుదల, నాణ్యమైన బోధన మరింత సమర్థంగా అందటానికి ఆస్కారం ఏర్పడింది.


జూనియర్ ఇంటర్ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అధ్యాపకులు


ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అధ్యాపకులు

సమష్టి కృషితో ఫలితాల సాధన



గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకు దూరం కాకుండా నాణ్యమైన విద్యనభ్యసించేందుకు హైస్కూల్ ప్లస్ దోహదపడుతోంది. ప్లస్ 2 కేంద్రంలో అడ్మిషన్ల సంఖ్యను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తరగతుల నిర్వహణకు ఇప్పటికే రెండు గదులు కేటాయించాము. ఈ విద్యాసంవత్సరం మెరుగైన ఫలితాల సాధన లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాము. సమష్టి కృషితో ఫలితాల సాధనకు కృషి చేస్తాం

ఆలపాటి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం, పునాదిపాడు జెడ్పీ పాఠశాల (హైస్కూల్ ప్లస్)

క్లుప్తంగా

సైన్స్ ఆచరణాత్మకమైనది



పెనమలూరు: సైన్స్ సిద్ధాంతపరమైనది మాత్రమే కాకుండా ఆచరణాత్మకమైనదని యువ పారిశ్రామికవేత్త బోట్‌క్లబ్ సీఈవో హర్షవర్ధన్ అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఏఐ రోబోటిక్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రోబోలు నేడు ఆరోగ్య సంరక్షణ, లాజిస్టిక్స్, అంతరిక్ష అన్వేషణ, అనేక రంగాల్లో ఉపయోగిస్తున్నారన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి దృష్టిలో ఉంచుకుని వారికి సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకోవటానికి తమ పాఠశాలలో రోబోటిక్స్ ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. కాగా 12వ తరగతి విద్యార్థులు రోబోటిక్స్ తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ వి.సాయికృష్ణ తదితరుల పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో రీసర్వే



విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రీ సర్వే కార్యక్రమం జరుగుతోంది. అంబాపురం, వేమవరం, కొత్తూరు, షాబాదు, జక్కంపూడి, పైడూరుపాడు గ్రామాల్లో రైతువారీ పట్టా భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి తెలియజేశారు. గ్రౌండ్ ట్రూత్ నిర్వహించి పొలం గట్లు ఏవిధంగా ఉన్నాయనే వివరాలను సేకరించడం, జాయింట్ డాక్యుమెంటా, సింగిల్ డాక్యుమెంటా అని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలో వున్నట్టయితే అనుభవదారు వివరాలను నమోదు చేస్తామన్నారు. రెండు రోజుల నుంచి జరుగుతున్న రీసర్వేలో ఇప్పటి వరకు 380 ఎకరాల వరకు రీసర్వే జరిగిందన్నారు. మండల సర్వేయర్ రమేష్, గ్రామస్థాయి సర్వేయర్లు, వీఆర్వోలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

పసుపు కొనుగోలు కేంద్రం పరిశీలన



ఉయ్యూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం అన్నారు. ఉయ్యూరు మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావుతో కలిసి మార్కెట్‌యార్డులో చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మార్కెట్ ఆవరణలో నిర్వహిస్తున్న పసుపు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోళ్లపై రైతులను అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఏడీ నిత్యానందం మాట్లాడుతూ 100 మందికి పైగా రైతులు నుంచి 2000 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేశారని తెలిపారు. మద్దతు ధరకే రైతుల వద్ద పసుపు కొనుగోలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ చర్యలతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు.

28న కొబ్బరి చెక్కలు పోగు చేసుకునేందుకు వేలం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2025 జూలై 31వ తేదీ వరకు రెండు సంవత్సరాల కాల పరిమితికి భక్తులు అమ్మవార్లకు సమర్పించిన కొబ్బరి చెక్కలను పోగుచేసుకునే లైసెన్స్ హక్కుకు ఈనెల 28న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ ఈ పాటలో పాల్గొనే ఔత్సాహికులు రూ.10వేలు డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. టెండర్ కమ్- బహిరంగ వేలంపాట కాలపరిమితి 2 సంవత్సరాలని హెచ్చుపాటదారు రెండవ సంవత్సరమునకు హెచ్చుపాటపై 10శాతం అదనంగా చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

కుమార్తె అదృశ్యంపై కేసు

మధురానగర్: ట్యూషన్‌కు వెళ్లిన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదంటూ శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. భరతమాత మందిరం రోడ్డు ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం జరిగింది. రెండో కుమార్తె ఇంటర్ మధ్యలో ఆపేసి ఇంట్లోనే ఉంటోంది. రెండు నెలల నుంచి రైతుబజారు సమీపంలోని ఉర్దూ ట్యూషన్‌కు వెళ్తోంది. బంధువులు ఇంటికి రావటంతో గత 15 రోజులుగా ట్యూషన్‌కు వెళ్లలేదు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఉర్దూ ట్యూషన్‌కు వెళుతున్నానని చెప్పి బయలుదేరిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెదికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: పోరంకిలో ఉంటున్న చేపల సాగుదారుడిని బెదిరించిన ఐదుగురు వ్యక్తుల పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా చిననాంద్రకొలను గ్రామానికి చెందిన రుద్రరాజు సుబ్బరాజు చేపల సాగు చేస్తాడు. పిల్లల చదువు నిమిత్తం గత కొద్ది కాలంగా పోరంకిలో నివాసం ఉంటున్నాడు. అయితే గత ఏడు నెలల క్రితం సుబ్బరాజు వద్దకు గుడివాడకు చెందిన మద్దినేని ప్రభాకర్, మద్దినేని ఏడుకొండలు, మద్దినేని వెంకటసుబ్బారావు, మద్దినేని శ్రీనివాసరావు, మల్లి పోరంకి వచ్చారు. తమ వద్ద లారీలు ఉన్నాయని, చేపల ఎగుమతి చేస్తామని చెప్పారు. దీనికి సుబ్బరాజు అంగీకరించటంతో సాగుచేస్తున్న చేపలు ఎగుమతి చేసి సకాలంలో సొమ్ము చెల్లించారు. అయితే గత కొద్దిరోజుల క్రితం ఒకేసారి ఏడు లారీల చేపలు ఎగుమతికి తీసుకెళ్లారు. చేపల తాలూకు సొమ్ము చెల్లించకపోవటంతో పై వ్యక్తులు రుద్రరాజు సుబ్బరాజు వద్దకు వచ్చి సొమ్ము చెల్లించే వరకు చెక్కులు, ప్రామసరీ నోట్లు డిపాజిట్‌గా ఉంచారు. అయితే ఈ నెల 14వ తేదీన ఆ వ్యక్తులు కానూరు నుంచి వస్తున్న రుద్రరాజును అడ్డగించి తాము సొమ్ము చెల్లించేది లేదని, డిపాజిట్‌గా ఉంచిన చెక్కులు, నోట్లు ఇవ్వాలని లేని పక్షంలో అంతుచూస్తామని బెదిరించారు. ఈ ఘటన పై బాధితుడు పోలీసులు ఫిర్యాదు చేయటంతో శుక్రవారం కేసు నమోదు చేశారు

బాలికను వేధిస్తున్న బాలుడిపై కేసు నమోదు

కంకిపాడు: ప్రేమించమంటూ బాలికను వేధిస్తున్న బాలుడిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు...మండలంలోని ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో బాలిక విద్యనభ్యసిస్తుంది. ఇదే గ్రామానికి చెందిన బాలుడు (15) ఆ పాఠశాలలోనే చదివి మానేశాడు. కొద్ది కాలంగా బాలిక వెంటపడుతూ ప్రేమించమని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 22న బాలిక పాఠశాలలో ఉండగా బాలుడు బాలిక ఉన్న తరగతి గది బయట కిటికీ నుంచి ప్రేమించమని వేధింపులకు గురిచేశాడు. దీంతో బాలిక విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లింది. హెచ్‌ఎం స్పందించి బాలిక తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. తనపై జరుగుతున్న వేధింపులపై బాలిక కంకిపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో మైనరు బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

బంగారు గొలుసు చోరీ పై కేసు

పెనమలూరు: ఇంట్లో ఉంచిన బంగారు గొలుసు చోరీ అయిన ఘటన పై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కానూరు మురళీనగర్‌కు చెందిన ప్రొద్దుటూరి వసంతకుమారి గత కొద్ది రోజుల క్రితం వాష్‌రూమ్‌కు వెళ్లటానికని తన మెడలో ఉన్న బంగారు గొలుసు వరండాలో ఉంచి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చి గొలుసు తీసుకోవటం మరిచిపోయింది. సాయంత్రం గుర్తుకు వచ్చి గొలుసు కోసం వెతుకగా అది కనిపించలేదు. పోయిన బంగారు గొలుసు విలువ రూ.88 వేలు ఉంటుందని, గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

అమ్మవారికి కుంకుమ పూజ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజ చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రామలింగేశ్వరస్వామివారికి ప్రత్యేకాభిషేకం చేశారు. భక్తులు పూజా కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.


అమ్మవారికి కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం

రామవరప్పాడు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో శుక్రవారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను, అవసరాలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి అందుతున్న సంక్షేమ పథకాల గురించి వాకబు చేయాలన్నారు. వీటితో పాటు అవసరమైన వారికి ప్రభుత్వం అందించే 9 రకాల సర్టిఫికెట్లు, ఆధార్‌కు మొబైల్ నంబర్ లింకింగ్, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల విభజన, ఆధార్ సేవలు ప్రజలకు చేరువ చేసే విధానాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జెడ్పీటీసీ సువర్ణరాజు, ఉపసర్పంచ్ అంకం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ పరిమి సింధూర, సచివాలయాల మండల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పెనుమాక రాజేష్, కో కన్వీనర్ కలపాల విజయ్‌కుమార్, సచివాలయాల కన్వీనర్లు బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, పరిమి విష్ణు, గొడపర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ స్కూల్‌ను సందర్శించిన ఈటీఎస్ ప్రతినిధులు

పెనమలూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం రాత్రి అంతర్జాతీయ సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీసీ) బృందం సందర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటంతో ప్రపంచ స్థాయి పోటీని విద్యార్థులు తట్టుకోవటానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యార్థులు టోఫెల్ పరీక్షకు శిక్షణ ఇవ్వటానికి ప్రభుత్వం ఈటీఎస్‌తో ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఈటీఎస్ బృందం పెనమలూరు పాఠశాలను సందర్శించి పాఠశాలలో వసతులు, విద్యా బోధన, విద్యా విధానం, సిలబస్ తదితర అంశాలను పాఠశాల హెచ్‌ఎం వై.దుర్గాభవానిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రతినిధి బృందంతో పాటు ఎంఈవో కనకమహాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.


ప్రతినిధి బృంద సభ్యులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం దుర్గాభవాని

రేపు హై అల్టిట్యూడ్ బెలూన్ శాట్ ప్రయోగం

సాక్షి, అమరావతి: అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి, అవగాహన కల్పించేలా 'హై అల్టిట్యూడ్ బెలూన్ శాట్' ప్రయోగాన్ని నిర్వహిస్తున్నట్టు ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్వీ ప్రసాద్ తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధన రంగాల్లో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఇందులో భాగంగానే స్పేస్ కిడ్జ్ ఇండియా సహకారంతో గన్నవరం సమీపంలోని తమ కళాశాలలో ఈనెల 25న అంతరిక్షం, అంతరిక్ష అన్వేషణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిన్న ఉపగ్రహాలు, స్పేస్ క్రాఫ్టులు, గ్రౌండ్ సిస్టమ్ రూపకల్పనలో స్పేస్ కిడ్జ్ భారతదేశంలోనే అగ్రగామిగా ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా హై అల్టిట్యూడ్ బెలూన్ నానో శాట్ ప్రయోగంతో వాతావరణంలోని పరిస్థితులను విశ్లేషించనున్నట్టు చెప్పారు. ఈ ప్రయోగంలో హై అల్టిట్యూడ్ బెలూన్ మూడు గంటల పాటు ఆకాశంలో ఉంటుందని.. అత్యధికంగా 22 కిలోమీటర్లకు పైగా (75వేల అడుగులు) ఎత్తులోకి ప్రవేశించి వాతావరణంలో డేటాను సేకరిస్తుందన్నారు. ఉషారామ శాట్ మిషన్‌కు డైరెక్టర్‌గా విద్యార్థి అక్షయ్ వ్యవహరిస్తున్నట్టు వివరించారు. సమావేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రాజశేఖర్ రావు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.యజ్ఞసాయి, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ రిఫత్ షారూక్, స్పేస్ కిడ్జ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉషారామా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్వీ ప్రసాద్

'పది' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- ఎన్టీఆర్ జిల్లాలో 57 శాతం ఉత్తీర్ణత
- కృష్ణా జిల్లాలో 40.56 శాతం ఉత్తీర్ణత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు 57 శాతం ఉత్తీర్ణతను సాధించగా, కృష్ణాజిల్లాలో 40.56 శాతం ఉత్తీర్ణులయ్యారు. మార్చి మాసంలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు విద్యాశాఖ ఈ నెల రెండో తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను చేపట్టింది. ఈ నెల పదో తేదీ వరకూ పరీక్షలు కొనసాగాయి. అనంతరం 13, 14 తేదీల్లో పరీక్ష పత్రాల వాల్యూయేషన్‌ను నిర్వహించారు. పరీక్ష ఫలితాలను శనివారం ఉన్నత విద్యాశాఖ ప్రకటించింది. అందులో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 8,477 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో బాలురు 4,813 మంది ఉండగా, బాలికలు 3,664 మంది ఉన్నారు. పరీక్ష రాసిన వారిలో 4,832 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 2,579 మంది బాలురు, 2,253 మంది బాలికలు ఉన్నారు. ఉత్తీర్ణత 57 శాతంగా ఉంది. అందులో బాలురు ఉత్తీర్ణత శాతం 53.58 ఉండగా, బాలికల ఉత్తీర్ణత శాతం 61.49గా ఉంది. అదేవిధంగా కృష్ణాజిల్లాకు సంబంధించి 5,880 మంది హాజరవ్వగా అందులో 3,626 మంది బాలురు, 2,254 మంది బాలికలు ఉన్నారు. ఉత్తీర్ణులైన వారు 2,385 మంది ఉండగా అందులో బాలురు 1,346 మంది, బాలికలు 1,039 మంది ఉన్నారు. ఉత్తీర్ణత శాతం 40.56గా ఉంది. అందులో 37.12 శాతం బాలురు, 46.10 శాతం బాలికలు ఉత్తీర్ణులైనట్లు అధికారులు ప్రకటించారు.

రీకౌంటింగ్‌కు 29 వరకూ గడువు..

ఈ నెల 29వ తేదీ లోపు విద్యార్థులు రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. అదే విధంగా విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఇబ్బందులు లేకుండా నాలుగు రోజుల్లో విద్యార్థుల మార్కుల జాబితాలను వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు. అలాగే త్వరలోనే విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ సర్టిఫికెట్లను సంబంధిత పాఠశాలలకు పంపించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తొలుత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ నెల 24 నుంచి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉండి లబ్ధి పొందని వారి సమస్య పరిష్కారానికి కావాల్సిన పత్రాలను సేకరిస్తారని తెలిపారు. కుల, ఆదాయ, జనన తదితర సర్టిఫికెట్లు జారీ నిమిత్తం దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. జూలై 1 నుంచి సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించి అర్జీలను పరిష్కరించడంతో పాటు సర్వీస్ ఫీజు లేకుండా సర్టిఫికెట్లు మంజూరు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీవో సత్యకుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమసర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. పెదపులిపాక గ్రామంలో శుక్రవారం అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర పౌరసేవలు తక్షణం అందే విధంగా చర్యలు తీసుకోవాని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరి, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈవో వి.పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 1 నుంచి జగనన్న సురక్ష క్యాంప్ షెడ్యూల్

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం అమలులో భాగంగా జూలై 1 నుంచి 28వ తేదీ వరకు మండల స్థాయి అధికారుల బృందాలతో సచివాలయ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యకుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24 నుంచి ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష పథకం గురించి వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలు, అర్జీలను సచివాలయ క్యాంప్‌లో పరిష్కరిస్తారన్నారు. క్యాంప్‌ల నిర్వహణ నిమిత్తం తహసీల్దారు, ఎంపీడీవో నేతృత్వంలో రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై 1న అజ్జంపూడి, బుద్ధవరం-1, 3న అల్లాపురం, బుద్ధవరం-2, 5న చిక్కవరం, చిన్నఅవుటపల్లి, 7న గన్నవరం-1, గన్నవరం-2 సచివాలయాల్లో జరుగుతుందన్నారు. జూలై 10న గన్నవరం-3, గన్నవరం-4, 12న గొల్లనపల్లి, కేసరపల్లి-1, 14న కేసరపల్లి-2, కొండపావులూరు, 17న మాదలవారిగూడెం, ముస్తాబాద-1 సచివాలయాల్లో జరుగుతాయని తెలిపారు. జూలై 19న ముస్తాబాద-2, పురుషోత్తపట్నం, 21న సావరగూడెం, తెంపల్లి, 24న సూరంపల్లి-1, 26న సూరంపల్లి-1, వీరపనేనిగూడెం-1, 28న వీరపనేనిగూడెం-2 సచివాలయాల్లో జరుగుతుందన్నారు.

జగనన్న సురక్ష ప్రత్యేక కార్యక్రమాలు

కంకిపాడు: ప్రభుత్వ ఆదేశాలతో జూలై 1 నుంచి అన్ని సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ జూలై 1న దావులూరు, 4వ తేదీన మద్దూరు, 5న వేల్పూరు, 6న తెన్నేరు, 7న మంతెన, నెప్పల్లి, 11న కోలవెన్ను, 12న ఉప్పలూరు, 13న గొడవర్రు, 14న ప్రొద్దుటూరు, 15న పునాదిపాడు-1, పునాదిపాడు-2, 18న కంకిపాడు-3, 19న ఈడుపుగల్లు -1, 21న ఈడుపుగల్లు-2, కంకిపాడు-2, 22న కంకిపాడు-1 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఇందు కోసం రెండు బృందాలుగా అధికారులకు బాధ్యతలు అప్పగించారన్నారు. ఒక బృందానికి తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్ నేతృత్వం వహిస్తారని పేర్కొన్నారు. ఈ బృందంలో సభ్యులుగా ఈఓఆర్డీ పీవీఎస్ మైథిలి, ఆర్‌ఐ వెంకటరమణ ఉంటారన్నారు. రెండో బృందానికి ఇన్‌చార్జి ఎంపీడీఓ, ప్రతినిధులుగా డెప్యూటీ తహసీల్దార్ టి.నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ టి.స్వరూప్‌కుమార్‌రాజు ఉంటారన్నారు.

తాడిగడప మునిసిపాలిటీలో జగనన్న సురక్ష

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి 27వ తేదీ వరకు సచివాలయాల వారీగా జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి గాను రెండు టీంలు వేశామని తెలిపారు. వచ్చే నెల 1వ తేదీన కానూరు 5, పోరంకి 1 సచివాలయంలో, 4వ తేదీన కానూరు 4, పోరంకి 2లో, 6వ తేదీన పోరంకి 3లో, 7వ తేదీన కానూరు 3లో, 11వ తేదీన కానూరు 2లో, పోరంకి 4లో, 13వ తేదీన పోరంకి 5లో, 14వ తేదీన కానూరు1లో, 15వ తేదీన యనమలకుదురు 1 సచివాలయంలో జగనన్న సురక్ష ఉంటుందని తెలిపారు. అలాగే 18వ తేదీన తాడిగడప1లో, యనమలకుదురు 2లో, 20వ తేదీన యనమలకుదరు 2లో, 21వ తేదీన తాడిగడపలో 2లో, 22వ తేదీన యనమలకుదురు 4లో, 25వ తేదీన తాడిగడప 3లో, యనమలకుదురు 5లో, 27వ తేదీన తాడిగడప 4వ సచివాలయంలో జగనన్న సురక్ష నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కారం చేస్తామని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు అన్ని గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం

విజయవాడరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ(ఇన్‌చార్జి) బీఎల్‌వీ శేషగిరిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకుంటారన్నారు. ఆ సమస్యల పరిష్కారం నిమిత్తం ఉన్నతాధికారులకు తెలియజేయడం ద్వారా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు.

25 నుంచి యోగ శిక్షణ తరగతులు

కంకిపాడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఈనెల 25వ తేదీ నుంచి శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం గోసాల శాఖ ఆధ్వర్యంలో యోగ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ప్రతినిధి యోగా శిక్షకులు నేరెళ్ల తులసీకృష్ణ తెలిపారు. 28 రోజులు పాటు యోగ శిక్షణ కొనసాగుతుందన్నారు. 8 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయస్సు వరకూ యోగ, ధ్యానం శిక్షణ తీసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9133306804 నంబరులో సంప్రదించాలని సూచించారు.

28న దేవాలయ భూముల కౌలు వేలం

ఉయ్యూరు: మండలంలోని కాటూరు, చిన ఓగిరాల గ్రామాల్లో దేవదాయశాఖ భూముల కౌలు బహిరంగ వేలం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మాధవీలత తెలిపారు. కాటూరు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంకు చెందిన మాగాణి భూమి 5.87 ఎకరాలకు మధ్యాహ్నం 12 గంటలకు, చిన ఓగిరాలలోని నాగేశ్వరస్వామి దేవస్థానంకు మాగాణి భూమి 2.18 ఎకరాలకు ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. మహదేవపురంకాలనీ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. దీని కారణంగా పంటకాలువ రోడ్డు, సనత్‌నగర్, కామయ్యతోపు, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం రాజుల బజారు, సాయిబాబు ఆలయ ప్రాంతం, రామవరప్పాడులో యాదవుల బజారు, సాయిబాబా ఆలయ ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జూలై 1వ తేదీ నుంచి కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం శిక్షణ విభాగం కన్వీనర్ యు.వి.రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాలీ ఇన్ అడ్వాన్స్, ట్యాలీ ఇన్ జీఎస్టీ, ఎంఎస్ ఆఫీస్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్ బీఐ, ఇంటర్‌నెట్ కాన్సెప్ట్స్, సీ లాంగ్వేజ్, పైథాన్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.